**కథ**

# ఉత్తముడు

**ముచ్చర్ల రజనీశకుంతల**

**విదుర రాజ్యం భయంతో కంపించిపోతోంది. పక్షం రోజులుగా ఆ రాజ్యంలో కనీ వినీ ఎరుగని సంఘటనలు జరుగుతూ, పౌరులను భయోత్పాతానికి గురిచేస్తున్నాయి. కరాళుడనే రాక్షసుడు విదుర రాజ్యంలో తన క్షుద్ర మాయోపాయాలతో ప్రజలను భయకంపితుల్ని చేస్తున్నాడు.**

విదుర రాజ్యాధీశుడు మహావీరవర్మ ఉత్తమ పరిపాలకుడు. దైవచింతన, ప్రజల యెడ అభిమానం మెండుగా వున్నవాడు. రాజ్యంలో జరుగుతున్న సంఘటనలకు తీవ్ర కలత చెంది, తన సైన్యాన్ని కరాళుడి మీదికి పంపించాడు. రాక్షస మాయ ముందు సైన్యం నిలువలేకపోయింది.

మహావీరవర్మ వెంటనే రాజ్యమంతా దండోరా వేయించాడు. కరాళుడ్ని సంహరించినవారికి తన కూతుర్ని కానీ, తన రాజ్యాన్ని కానీ యిస్తానని ప్రకటించాడు. మహావీరవర్మ కూతురు రంజని అతిలోక సుందరి. ఎన్నో పూజల ఫలంగా పరమేశ్వరుడి అనుగ్రహంతో జన్మించిన వ్యక్తి రంజనిని చేపట్టాలని ఎన్నో దేశాల యువరాజులు ముందుకు వచ్చారు. మామూలు స్వయంవరంలా కాక, కరాళుడ్ని సంహరించాలనే షరతు విని కొందరు వెనక్కి తగ్గారు.

మరికొందరు సాహసికులు రంజనిని చేపట్టాలా? రాజ్యాన్ని స్వీకరించాలా? అనే మీమాంసలో పడిపోయారు. దేశం నలుమూలల నుంచి వీరులు వచ్చారు. వివిధ దేశాల రాజకుమారులూ వచ్చారు. దేశ సరిహద్దులో వుండే కరాళుడ్ని అంతం చేయడానికి జట్లు జట్లుగా చీలిపోయారు.

మాయోపాయాలతో పోరాడే కరాళుడి ముందు ఎవ్వరూ నిలవలేకపోయారు. కరాళుడు అందర్నీ బంధించాడు. మహావీరవర్మకు ఎటూ పాలుపోలేదు. విదుర రాజ్యాన్ని కాపాడే వీరుడి కోసం మరోసారి దండోరా వేయించాడు.

★ ★ ★

ఆ దండోరా విజయుడి చెవిన పడింది. తోటలోని పువ్వులను కోసి తల్లికి తెచ్చి యిస్తే, వాటిని మాలలుగా కట్టి రాజవీధిలో అమ్ముతూ వుంటుంది. సాహసం, పరోపకార బుద్ధి విజయుడి స్వంతం. కరాళుడి బారిన పడే ప్రజలను కాపాడే వుద్దేశ్యంతో మహారాజు దగ్గరకి వెళ్ళాడు.

''మహారాజా! కరాళుడ్ని అంతమొందించే అవకాశం నాకు యివ్వండి'' అంటూ వినమ్రస్వరంతో విన్నవించుకున్నాడు. మహారాజు నూనూగు మీసాలతో, పులి లాంటి చూపులతో వున్న విజయుడి వైపు చూసి...

''మహా మహా వీరులే ఆ పని చేయలేక రాక్షసుడి వద్ద బందీలుగా వున్నారు. నీకు కర్రసాము తెలుసా? మల్లయుద్ధంలో నిష్ణాతుడివా? అస్త్రవిద్యలు అభ్యసించావా? ఖడ్గయుద్ధంలో ప్రావీణ్యమున్నదా?'' అంటూ ప్రశ్నించాడు.

''వాటి అన్నింటికీ మిన్న అయిన సంకల్పం వున్నది మహాప్రభూ... సంకల్పాన్ని మించిన బలం లేదు. సవాశయాన్ని మించిన అస్త్రం లేదు. కార్యదీక్షను మించిన ఖడ్గప్రావీణ్యం అవసరం లేదు. మనోవాక్కాయ శక్తిని మించిన మల్లయుద్ధ కిటుకులూ అవసరం లేదు'' స్థిరంగా, గంభీరంగా చెప్పాడు విజయుడు.

''నీ మాటలు ముచ్చట గొలుపుచున్నవి... చేతల్లో ఆ అసురుడ్ని ఎదిరించగలవా?'' సూటిగా అడిగాడు.

''తోటి పౌరుల కోసం, నా దేశ వీరుల కోసం నేను ఆ కరాళుడ్ని జయించగలననే నమ్ముతున్నాను. నన్ను ఆశీర్వదించి, అనుమతించండి'' చెప్పాడు విజయుడు.

మహావీరవర్మ మహామంత్రి వైపు చూసి, విజయుడికి చెప్పాడు.

''నీ వెంట అశ్వబలాన్ని, గజబలాన్ని, సేనాబలాన్ని పంపిస్తున్నాను. విజయుడివై తిరిగిరా.''

''నేను ఒంటరిగానే వెళ్తాను మహారాజా. గెలిస్తే ఈ దేశంలో తిరిగి ప్రజలు ఆనందంగా బ్రతుకుతారు. ఓడితే నేను ఆ కరాళుడికి బందీగా వుండను. ఆత్మార్పణ చేసుకుంటాను'' అని చెప్పి కరాళుడితో యుద్ధం చేయడానికి బయల్దేరాడు.

★ ★ ★

పర్వతమంత ఆకారం కలిగిన కరాళుడు తన ముందు అల్పరూపంలో కనిపిస్తోన్న విజయుడి వైపు చూసి ఫెళ్ళున ఆకాశం ఉరిమినట్టు నవ్వి చెప్పాడు.

''నా ఊపిరితో యోజనాల దూరం ఎగిరిపడగలవు... నాతో నీకు యుద్ధమేమిటి? నిన్ను చూస్తోంటే జాలి కలుగుతోంది. వెనుతిరిగి పారిపో..''

''ఓరీ భీరువా... యోధుడెప్పుడూ మాటలు మీరడు. చేతలతో నన్ను ఎదుర్కో... చేతకాదా... మా మహారాజు పాదాలపై పడి క్షమాపణ వేడుకో... ఈ రోజుతో నువ్వో, నేనో తేలిపోవాలి. సయోధ్య కావాలా? సమరం కావాలా? తేల్చుకో...''

కరాళుడి కోపం నషాళానికి అంటింది. పెద్ద పెద్ద అడుగులతో విజయుడి వైపు దూసుకు వచ్చేస్తున్నాడు. విజయుడు తన ఇష్టదైవమైన దుర్గామాతను మనసులో తలుచుకున్నాడు. ఒరలో నుంచి కత్తిని తీసి కరాళుడి మీద దూసాడు.

కొద్ది క్షణాల్లో ఆ కత్తి తుత్తునియలు అయింది. విజయుడు ముష్టిఘాతాలతో కరాళుడ్ని గాయపర్చాలని ప్రయత్నించీ విఫలుడయ్యాడు.

కరాళుడ్ని ఎలా ఎదుర్కోవాలో అర్థం కాలేదు. అతని మాయల నుంచి, బలం నుంచి తప్పించుకొని, అతడిని గెలవడం అసాధ్యమని అర్థమైంది.

కొద్దిక్షణాలు యోచించాడు. కరాళుడ్ని మనోబలంతో జయించాలి. బుద్ధికుశలతతో ఓడించాలి.

విజయుడు ఆలోచనలో పడిపోవడం చూసి ''ఓరీ అర్భకా... భయపడిపోతున్నావా? ఇప్పటికైనను మించినది లేదు. చేసిన తప్పునకు లెంపలు వేసుకుని, నా దగ్గర బందీవై వుండిపో...'' అంటూ హెచ్చరించాడు.

''కరాళా... మనిద్దరి మధ్యా యుద్ధం వద్దు. నిజంగా నాకన్నా నువ్వు గొప్పవాడివైనచో... మనిద్దరి మధ్యా చిన్న పందెం... అందులో నువ్వు గెలిస్తే, నేను ఆత్మార్పణ చేసుకుంటాను. నేను గెలిస్తే నువ్వు ఈ దేశం వదిలి వెళ్ళిపోవాలి.''

కరాళుడికి ఆ పందెం వింతగా తోచింది. విజయుడి బుద్ధికుశలత అర్థంగాని ఆ రాక్షసుడు ''ఏమా పందెం... ఏ పందెంలోనైననూ నేనే గెలుస్తాను. మీ మానవులకు బుద్ధిమంతులమని పొగరు...'' అన్నాడు.

''మంచిది రాక్షస రాజా... అసుర సంధ్యవేళ



యుద్ధం చేయుట యుద్ధనీతి కాదు. తొలిఝాము వరకూ మనిద్దరం ఊపిరి బిగపట్టి వుండాలి. అలా ఎవరు ఉండగలిగితే వాళ్ళు జయించినట్టు... నువ్వు నాకన్నా గొప్ప బలవంతుడివి కదా... ప్రయత్నించు'' అంటూ రెచ్చగొట్టాడు.

కరాళుడు ముందూ, వెనకా ఆలోచించక 'సరే' అన్నాడు.

★ ★ ★

కరాళుడు ఊపిరి బిగపట్టాడు. విజయుడు రోజూ యోగాసనాలు చేయడం వల్ల అతనికి వాయుస్తంభన, జలస్తంభన లాంటి విద్యలు తెలుసు. కరాళుడు పంతంకొద్దీ ఊపిరి బిగపట్టి తొలి ఝాముకు ముందే ఊపిరి విడిచి ప్రాణాలు వదిలేసాడు, భుజ బలమే తప్ప బుద్ధి బలం లేని ఆ రాక్షసుడు.

కరాళుడి మరణంతో అతడి దగ్గర బందీలుగా వున్న వీరులు, రాకుమారులు స్వేచ్ఛగా గాలి పీల్చుకున్నారు. విజయుడు విజయుడై రాజ్యానికి తిరిగి వచ్చాడు. అతనికి ఘనస్వాగతం ఏర్పాటు చేసారు.

మహావీరవర్మ ఇచ్చిన మాట ప్రకారం ''నీకు నా కుమార్తె కావాలా? రాజ్యం కావాలా?'' అని ప్రశ్నించాడు.

విజయుడు వినయంగా ఆ రెంటినీ తిరస్కరించాడు.

''అదేమిటి మహావీరా... రాజ్యలక్ష్మిని, నీ చేయి అందుకోబోయే హృదయలక్ష్మిని తిరస్కరిస్తున్నావు...'' ఆశ్చర్యంగా అడిగాడు మహారాజు.

''క్షమించండి మహారాజా... దేశాన్ని కాపాడవలసిన బాధ్యత మహారాజుది మాత్రమే కాదు సామాన్య ప్రజలది కూడా. నేను నా బాధ్యత నెరవేర్చాను. నేను స్వలాభాన్ని ఆశించి, ప్రతిఫలాపేక్షతో ఈ దేశాన్ని కాపాడుకోవడం ఉత్తమ పౌర లక్షణం అనిపించుకోదు. ఈ దేశాన్ని ఓ బాధ్యత గల పౌరుడిగా కాపాడి, అందుకు ప్రతిఫలంగా మీ కూతురినో, రాజ్యాన్నో అందుకోమంటారా మహారాజా...'' ఆ ప్రశ్నతో మహారాజు పరమానందభరితుడయ్యాడు.

'గెలిచావు వీరకుమారా... నువ్వూ, ఈ దేశ ప్రజలు నన్ను క్షమించాలి... నాకు దైవచింతనా ఎక్కువని తెలుసు... నేను వానప్రస్థం స్వీకరించాలని నిర్ణయించుకున్నాను. నాకు కొడుకులు లేని కారణంగా ఈ దేశానికి కాబోయే మహారాజుగా నా అల్లుడిని నియమించాలని యోచించాను. అందుకు యోగ్యుడు కావాలని అన్వేషించాను.

మహామంత్రి సాయంతో హరిత గ్రామంలోని మహా తపస్వి జ్ఞానమునిని వేడుకున్నాను. కరాళుడనే రాక్షసుడ్ని సృష్టించాడా తపస్వి. ఈ దేశాన్ని ఆ రాక్షసుడి బారినుండి ఎవరు కాపాడతారా? అని ఎదురు చూసాను.

యుద్ధంలో ఆయుధబలం కన్నా, అంగబలం కన్నా, బుద్ధి బలమే మిన్న అని నిరూపించి యోధుడివి అనిపించుకున్నావు. రాక్షస సంహారానికి ప్రతిఫలంగా యువరాణిని స్వీకరించడానికి విముఖత చూపించి, విజ్ఞుడివి అనిపించుకున్నావు. రాజ్యకాంక్షతో రాజ్యాన్ని స్వీకరించకుండా సకల గుణ సౌశీల్యుడివి అనిపించుకున్నావు. నువ్వు సామాన్యుడివి కాదు. అసామాన్యుడివి... ఉత్తముడివి... నీలాంటి యోగ్యుడి చేతుల్లో నా కూతుర్ని, రాజ్యాన్ని పెట్టి నేను వానప్రస్థం స్వీకరిస్తాను. దయచేసి మా మాట మన్నించండి'' రెండు చేతులు జోడించాడు.

పౌరులంతా మహారాజు మాటలను బలపరిచారు. మహారాజు కుమార్తె రంజని చేయి అందుకుని సప్తపది నడిచాడు.

సింహాసనాన్ని అధిష్టించి జనరంజకంగా పరిపాలన ఆరంభించాడు.

దేవతలు పుష్పవర్షం కురిపించారు.